క్లుప్తంగా

పీఎస్‌ఆర్‌కు సన్మానం


ప్రేమ్‌సాగర్‌రావుకు మిఠాయి తినిపిస్తూ..

బెల్లంపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ కె.ప్రేమ్‌సాగర్ రావుకు ఆదివారం ఆత్మీయ సన్మానం చేశారు. బెల్లంపల్లి కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్సీకి శాలువా కప్పి, మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సూరం రవీందర్‌రెడ్డి, రొడ్డ శ్యామ్, శారద, కంకటి శ్రీనివాస్, సరోజన తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల నిరసన

దండేపల్లి: సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 18వ రోజుకు చేరింది. దండేపల్లిలో చెవిలో పువ్వులు పెట్టుకుని, వినూత్న నిరసన తెలిపారు.
కాసిపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సమ్మె కొనసాగింది.

'సుమన్ నేతృత్వంలో నియోజకవర్గం అభివృద్ధి'

చెన్నూర్‌రూరల్: ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ నేతృత్వంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ కొమ్ము అశోక్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని కత్తెరసాలలో ఆదివారం అభివృద్ధి పనులను పరిశీలించారు.

'ఎన్నిక రద్దు చేయాలి'

మందమర్రిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ ఎన్నిక జరిగిందని, ఈ ఎన్నికను రద్దు చేసి నిబంధనల ప్రకారం మళ్లీ నిర్వహించాలని అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ డిమాండ్ చేశారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు ఎనభై వరకు సొసైటీలు ఉన్నాయని, సొసైటీలన్నీ ఓటింగ్ విధానంతోనే జరిగాయని గుర్తు చేశారు.

టీడీపీ నాయకుల అరెస్టు

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం బెల్లంపల్లిలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల శిలాఫలకానికి క్షీరాభిషేకం చేయడానికి యత్నించిన తెలుగుదేశం పార్టీ శ్రేణులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ నాయకులు టి.మణిరాంసింగ్, హరికిషన్ పాండే, గద్దల నారాయణ, రవి, బొల్లు మల్లయ్య, హసన్‌లను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తాళ్లగురిజాల పోలీసుస్టేషన్‌కు తరలించారు.

'బీఆర్‌ఎస్‌ను బలపర్చండి'

జన్నారం: ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్న బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేసి, రానున్న ఎన్నికల్లో మద్దతు తెలుపాలని ఖానాపూర్ బీఆర్‌ఎస్ నేత భుక్యా జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని కలమడుగు గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ రాజుగౌడ్, సంగ అంజిత్‌ల ఆధ్వర్యంలో ఆయనకు డప్పు, వాయిద్యాలతో, పులి వేషాలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కడెం జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, జాన్సన్ యువసేనా నాయకులు ఫజల్‌ఖాన్, సురేశ్, వెంకటేశ్, ఎల్కుసు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'మణిపూర్ దోషులను బహిరంగంగా ఉరితీయాలి'


చెన్నూర్: మాట్లాడుతున్న నాయకులు

చెన్నూర్/పాతమంచిర్యాల: మణిపూర్ రాష్ట్రంలో మహిళలను అతికిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను బహిరంగంగా ఉరితీయాలని జిల్లా కేంద్రంలో భారత్ బచావో మంచిర్యాల కమిటీ నాయకులు, చెన్నూర్‌లో ఆదివాసీ సంఘం రాష్ట్ర నాయకులు గంజి రాజన్న అన్నారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఆదివారం చెన్నూర్, జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

నాణ్యతకు తిలోదకాలు



మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 14వ వార్డులో జనరల్ ఫండు రూ.15 లక్షలతో 400 మీటర్ల దూరం నిర్మించిన డ్రెయినేజీ ఇటీవల కురిసిన వర్షానికి ఒక పక్కకు పూర్తిగా ఒరిగింది. నాణ్యత లేకుండా నిర్మించడం వల్లే ఇలా జరిగిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు లక్షలాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా నాణ్యత లేకుండా పనులు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


గంగిపల్లిలో కూలిన ప్రభుత్వ పాఠశాల తరగతి గది

బడి.. సమస్యల ఒడి..!

- ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన తరగతి గది
- స్కూల్ లేకపోవడంతో తప్పిన పెనుముప్పు
- భయంభయంగా గడుపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల భవనం


మరో గదిలో పెచ్చులు రాలి..

జైపూర్: మండలంలోని గంగిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఏళ్ల కింద నిర్మించిన పాఠశాల కావడంతో శిథిలావస్థకు చేరింది. తరగతి గదుల్లో స్లాబ్ పై పెచ్చులు ఎక్కడికక్కడ రాలిపోవడం, అత్యంత ప్రమాదరకంగా మారింది. ఏడు తరగతులకు సంబంధించిన సమారు 35మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా భయంభయంగా గడుపుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఓ తరగతి గది కూలిపోయింది. పాఠశాలకు సెలవు ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో ఏడు తరగతులకు చెందిన విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి విద్య బోధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించడంతో పాటు తాత్కాలికంగా జాగ్రత్త చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో డీఎంఎఫ్‌టీ నిధులు 62లక్షలు, 28వ వార్డులో రూ.45లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో రోడ్లు, డ్రెయినేజీలు, రూ.5లక్షల మున్సిపల్ ఫండ్‌తో నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్లు నాంపల్లి మాదవి, సాయి భార్గవి పల్లపు, నాయకులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ
మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని టీకానపల్లి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్ రావు భూమిపూజ చేసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పనులు నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశ్వరి, ఉప సర్పంచ్ జితేందర్‌రావు, ఎంపీటీసీ సుజాత, రైతు బంధు సమితి మండల కన్వీనర్ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి జయంతి



లక్సెట్టిపేట: దాశరథి జయంతిని పురస్కరించుకుని మండలంలోని సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గుడ్‌షెప్పర్డ్ పాఠశాలలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దాశరథీ జీవితం, వ్యక్తిత్వం, సాహితిప్రస్థానం అనే అంశంపై కవిసమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి సాహిత్య వేత్తలు హాజరై కవితలు, గేయాలతో సమావేశాన్ని సంబురంగా చేశారు. అనంతరం దాశరథీ ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షులు గాయత్రి, ప్రధాన కార్యదర్శి నూటెంకి రవీంద్ర, సభ్యులు రవీందర్, తిరుపతి, శ్రీనివాస్, మల్లేశం, సుబ్బాయమ్మ, ప్రభాకర్, కుమార్, సురేష్, రాజేశ్వర్‌రావు, భారతి, ఆర్ ప్రకాశం పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు, పక్కన ఎమ్మెల్యే

బెల్లంపల్లి: విద్యార్థుల మెస్, డైట్‌చార్జీలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినందుకు కృతజ్ఞతగా బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. బెల్లంపల్లి బస్తీలోని ఎస్సీ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ బాలికల వసతీ గృహంలో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్‌ఎస్వీ శ్రేణులు అన్వర్, మురుకూరి శ్రావణ్, వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు గెల్లి రాజలింగు, కృష్ణ, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు దామెర కిరణ్, బీఆర్‌ఎస్ శ్రేణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వానాకాలంలోనూ తాగునీటికి ఇబ్బందులు


ప్రజలతో మాట్లాడుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: వర్షాకాలం ప్రారంభం అయినా, పట్టణ ప్రజలకు తాగునీటిని అందించడంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 28వ వార్డు ఒడ్డెర కాలనీలో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న ఒడ్డెర కాలనీ ప్రజలకు ఇప్పటి వరకు పట్టాలను అందించడంలో ఎమ్మెల్యే విఫలం చెందారన్నారు. వర్షాకాలం వచ్చినా, ఇప్పటికీ ట్యాంకర్ల ద్వారానే తాగునీటిని అందించడం బాధాకరమని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అర్నకొండ శ్రీనివాస్, పచ్చ వెంకటేశ్వర్లు, బొద్దున మల్లేశ్, ముదాం మల్లేశ్, గాజుల ప్రభాకర్, సతీశ్, నాగరాజు, వసంత, ఆరెందుల శ్రీనివాస్, రాకేశ్ రెన్వా, బింగి సత్యనారాయణ పాల్గొన్నారు.



అలుగులో.. చేపల వేట

కోటపల్లి: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుతుంగ వాగు ఉప్పొంగి అలుగు పారుతోంది. స్థానిక ఎదులబంధం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల యువత పెద్ద ఎత్తున తరలివచ్చి అలుగు నుంచి వరద నీటి ప్రవాహంలో పెద్దపెద్ద వలల సాయంతో చేపల వేటా కొనసాగిస్తున్నారు.

రక్షణ పరికరాలు ధరించి పని చేయాలి

- కార్పొరేట్ జీఎం(సేఫ్టీ) గురువయ్య


మాట్లాడుతున్న గురువయ్య

శ్రీరాంపూర్: ఉద్యోగులు తమ విధి నిర్వహణలో రక్షణ పరికరాలు ధరించి విధులు నిర్వర్తించాలని సింగరేణి కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో ఆదివారం రక్షణ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సింగరేణిలో 90శాతం ప్రమాదాలు మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయని, ఈ ప్రమాదాలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ.. రక్షణ సూత్రాలు పాటిస్తూ పనిచేస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు రక్షణ పై పలు రకాల ప్రశ్నలు వేస్తూ, వారి వద్ద నుంచి సమాధానాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తం రెడ్డి, మేనేజర్ సుధీర్ జక్కుల, గుర్తింపు సంఘ కేంద్ర ఉపాధ్యక్షుడు మంద మల్లారెడ్డి, ఫిట్ సెక్రటరీ శంకరయ్య, ఇంజనీర్ చంద్రశేఖర్, సంక్షేమ అధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగ కళాకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సింగరేణిలో గొప్ప కళా కారులు ఉన్నారని, వారి సేవలను కంపెనీ విని యోగించుకోవడం ఒక్కటే కాదని వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. వాయిద్య పరికరాలు అందించాలని, ప్రత్యేక హాల్ కేటాయించాలని కోరారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద ఆదివారం బీఎంఎస్(భారతీయ మజ్దూర్ సంఘ్) 68వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ అనుబంధ బీఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి బీఎంఎస్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ మాట్లాడారు. కార్మిక సమస్యలే ఎజెండాగా బీఎంఎస్ యూనియన్ పని చేస్తుందన్నారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో బీఎంఎస్ బలమైన కార్మిక సంఘంగా ఉందని వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ తెలిపారు. నాయకులు శ్రీధర్, కృష్ణ, వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.
నస్పూర్: బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులపై, నస్పూర్‌లోని యూనియన్ కార్యాలయం వద్ద బీఎంఎస్ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచుకుని సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, సెంట్రల్ సెక్రటరీ కాసెట్టి నాగేశ్వర్‌రావు, జాయింట్ సెక్రటరీ జీడీ ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి
చెన్నూర్: స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న పదో తరగతి విద్యార్థులను వేధిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులు వొడ్నాల శ్రీనివాస్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ చిప్పకుర్తి శ్రీనివాస్ అన్నారు. మైనార్టీ గురుకుల పాఠశాలను ఉన్నతాధికారులు సందర్శించాలన్నారు.

చైతన్య విద్యాసంస్థల అధినేతకు నివాళి
మంచిర్యాలరూరల్(హాజీపూర్): శ్రీ చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక అధినేత దివంగత బీఎస్.రావు ఇటీవల అకాలమరణం పొందారు. ఆయన మృతికి సంతాపంగా ఆదివారం మంచిర్యాల గార్డెన్స్‌లో బీఎస్.రావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సంస్మరణ సభలో మంచిర్యాల జోన్ పరిధిలోని మంచిర్యాల, గోదావరిఖని, బెల్లంపల్లి, మందమర్రి, కాగజ్‌నగర్‌లలోని శ్రీ చైతన్య పాఠశాలలకు చెందిన బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అన్నదానం
మంచిర్యాలఅర్బన్: స్థానిక పిరమిడ్ స్పిరిచ్యువల సొసైటీ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో పత్రీజీ స్మృతి స్మరోత్సవం సందర్భంగా ఆదివారం ఐబీ చౌరస్తాలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు భాస్కర్‌రాజు, సెక్రటరీ ఆరే మల్లేష్, కోశాధికారి కొండ శైలజ, రాంచందర్, అగ్గి భీమయ్య, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు పంపిణీ చేయాలి
మందమర్రిరూరల్: మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆదివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పరిశీలించారు. నియోజకవర్గంలో పేదల కోసం ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను వెంటనే అర్హులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు
చెన్నూర్: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారి పుట్టిన నక్షత్రం సందర్భంగా ఆలయంలో భక్తులు అర్చనలు, అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

దరఖాస్తుల ఆహ్వానం
కాసిపేట: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఈ ఆర్థిక సంవత్సరంలో పండ్లతోటల పెంపకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో ఎంఏ అలీం తెలిపారు. ఐదు ఎకరాల లోపు భూమి కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులు ఉపాధి జాబ్‌కార్డు, బోరుబావి ఎలక్ట్రిసిటీ కనెక్షన్ ఉన్నవారు అర్హులన్నారు. 31లోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి
దండేపల్లి: శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తామని, ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని లక్సెట్టిపేట సీఐ కృష్ణ అన్నారు. ఇటీవలే సీఐగా బాధ్యతలు స్వీకరించడంతో ఆదివారం దండేపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై కుందారపు ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ఉపేక్షించేది లేదు
జన్నారం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే, ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని లక్సెట్టిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పర్యటించిన అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమస్యలు ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి చెప్పుకోవాలని, మధ్యవర్తులను ఆశ్రయించొద్దన్నారు. ఎస్సై సతీశ్, సిబ్బంది ఉన్నారు.

అక్టోబర్ 1న విద్యార్థుల మెగా సమ్మేళనం
మందమర్రిరూరల్: అక్టోబర్ 1న సింగరేణి హైస్కూల్ 1978–2020వరకు చదివిన పూర్వ విద్యార్థుల మెగా సమ్మేళనం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సమ్మేళన కమిటీ పేర్కొంది. స్థానిక సింగరేణి హైస్కూల్ మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు పూర్వ విద్యార్థులు కార్యాచరణ రూపొందించి కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా గురువయ్య, రవీందర్, శివ, ఖదీర్, వేణుగోపాల్, భీరం రవి, సారంగపాణి, సమిహుల్లాహ్, సుల్తాన్, సత్తయ్య, తిరుపతి, సదానందంను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక
రామకృష్ణాపూర్: మందమర్రి మండలం పులిమడుగు గ్రామానికి చెందిన పలువురు యువకులు, మహిళలు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి
నెన్నెల: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్ అన్నారు. నెన్నెల పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం హరితహారంలో భాగంగా ఎస్సై శ్యాంపటేల్‌తో కలిసి మొక్కలు నాటారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం
దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన వేమునూరి మొగిలి, ఆయన కూతురు సుమలత అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చుల కోసం అఖిల భారత విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో దాతల నుంచి విరాళాలు సేకరించారు. సేకరించిన రూ.21వేల ఆర్థిక సాయాన్ని సంఘనాయకులు మొగిలికి ఆదివారం అందించారు.

పట్టణ ఓబీసీ అధ్యక్షుడిగా రమేశ్
మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణ కాంగ్రెస్ ఓబీసీ అధ్యక్షుడిగా కొత్తపల్లి రమేశ్‌ను నియమిస్తూ మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఆదివారం తన నివాసంలో నియామక ఉత్తర్వులను అందించారు.

కార్యవర్గం ఎన్నిక
పాతమంచిర్యాల: పద్మశాలీ సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా చిలగాని సుదర్శన్ మరో 21మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మహిళా మండలి చేయూత
మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ర్యాలీ పంచాయతీలోని కొలాంగూడ, మొర్రిగూడెం గ్రామాల గిరిజనులకు మహేశ్వరి మహిళా మండలి ఆధ్వర్యంలో మంచిర్యాల మ్యాక్స్‌కేర్ ఆస్పత్రి ఏర్పాటు చేసిన ఉచిత వైద్య పరీక్షా శిబిరంలో గిరిజనులకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు.



అ'పూర్వ' సమ్మేళనం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సీసీసీ–శ్రీరాంపూర్‌లోని కేంబ్రిడ్జ్ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో అ'పూర్వ' సమ్మేళనం ద్వారా 25 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితులతో ఆడిపాడారు. మరిచిపోలేని జ్ఞాపకాలు.. చిలిపి అల్లరిని గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. పాఠాలు బోధించిన ఆచార్యులను సత్కరించి వారి ఆశీర్వచనలు పొందారు. ఆనాటి ఆనంద క్షణాలను పంచుకున్నారు. ఉపాధ్యాయులు రామాంజన్‌రావు, సురేశ్, జగన్నాథం, సత్యం, పారిజాతం, పూర్వ విద్యార్థులు సురేశ్‌రెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, డాక్టర్ భాస్కర్, కుమారస్వామి, రాజు, కృష్ణ, సమ్మిరెడ్డి, భరత్‌కుమార్, తిరుపతిశంకర్, సంతోశ్, రమేశ్, మేఘమాల, స్వప్న, రమాదేవి, సబిత, కృష్ణవేణి, భాగ్యలక్ష్మి తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సామగ్రి అందజేత

తాండూర్: మండలంలోని బోయపల్లి బోర్డు వద్ద సేవాజ్యోతి అనాథ శరణాలయం విద్యార్థులకు ఆదివారం బెల్లంపల్లికి చెందిన మాతృ హృదయం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పుస్తకాల వితరణ చేశారు.